



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు
ఉత్సాహభరితంగా జిల్లా మహాసభ ప్రారంభం
ఎరుపెక్కిన హిందూపురం



సిఐటియు మహాసభల సందర్భంగా హిందూపురంలో మహాప్రదర్శన

ప్రజాశక్తి-హిందూపురం

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు 10వ జిల్లా మహాసభలు ఆదివారం హిందూపురం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని నంది సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ భవన్ రైల్వే రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, సద్భవన్ సర్కిల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదిక వరకు వందలాది మంది కార్మికులతో మహా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సి హెచ్ నర్సింగరావు మాట్లాడారు. పోరాటాలతో ఎలాంటి సమస్యలైనా పరిష్కారమవు తాయన్నారు. రూ.300 వేతనంతో ప్రారంభమైన అంగన్వాడీ కార్యకర్తలు ఈ రోజు రూ.11వేలు తీసుకుంటున్నారంటే పోరాట ఫలితమేనని చెప్పారు. ఆశా కార్యకర్తలు రూ.10వేలు వేతనం, గ్రాట్యుటీ, మెటర్నిటీ లీవ్ వంటి సౌకర్యాలను పోరాటాలతోనే సాధించుకున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అదే బాటలో పోరాడి సమస్యల్ని పరిష్కరించుకుంటున్నారని అన్నారు. సిఐటియు లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఈపాటికే ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించేదన్నారు. 75లక్షల మంది సభ్యులు ఉన్న సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిందని చెప్పారు. 42 రోజుల పాటు సమ్మె చేసినా స్పందించని వైసిపి ప్రభుత్వాన్ని అంగన్వాడీ కార్యకర్తలు గద్దె దింపారని గుర్తుచేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించే ఏ ప్రభుత్వానికైనా అదే విధంగా కార్మికులు బుద్ధి చెబుతారని అన్నారు. శ్రమజీవుల కష్టాలను గుర్తించని ప్రభుత్వాలు మట్టిలో కలిసిపోతాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ ఛార్జీలు పెరిగాయని గొంతు చించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిపక్ష నేతగా లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేయడం హర్షణీయమని, ఆటో కార్మికుల పొట్ట కొట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోదీ చెప్పిన ప్రతి పనికి జీ హుజూర్ అంటు కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని విమర్శి:చారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాల జోలికి వస్తే కార్మికుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 1నుంచి 4 వరకు విశాఖలో సిఐటియు జాతీయ మహా సభలు నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రణాళిక రూపొందించనున్నామని నర్సింగరావు చెప్పారు.

ఉద్యమాలతోనే కార్మికుల బతుకుల్లో మార్పు

కార్మికులు బలమైన ఉద్యమాలు చేయడంతోనే కార్మికుల బతుకులు మారుతాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు అన్నారు. జిల్లా మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం వ్యతిరేక ప్రభుత్వమని పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్మిక వర్గాన్ని మతపరంగా చీలుస్తూ హిందువుల ఐక్యత పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. అందుకే మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెడ్‌పి శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ విమర్శించారు. జిల్లాలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, దినసరి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగాలను కూటమి ఎమ్మెల్యేలు అమ్ముకుంటున్నారని విమర్శించారు. కొత్త ఉద్యోగాలు తీసుకు రాకుండా ఉన్న ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే జిల్లాలోని ప్రతి సెంటు భూమికి సాగునీరు అందించే అవకాశం ఉందని చెప్పారు. శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దిల్షాద్ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా ఉన్నా గార్మెంట్స్ పరిశ్రమల్లో మహిళా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొంటున్నారన్నారు. ఈ మహా సభలో సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, నరసింహులు, బాబావలి, లక్ష్మినారాయణ, ఉషారాని, శ్రీదేవి. సౌభాగ్య, స్థానిక నాయకులు రాము, రామకృష్ణతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అంగన్‌వాడీ, ఆశా, భవన నిర్మాణ కారికులు, బీడి కార్మికులు, సివిల్ సప్లైయి హమాలీలు, మున్సిపల్ కార్మికులు, వివిధ రంగాల స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు....ఎరుపెక్కిన పట్టణం

సిఐటియు జిల్లా మహా సభల సందర్భంగా వందలాది మంది కార్మికులు కదలి వచ్చారు. దీంతో హిందూపురం పట్టణం ఎరుపెక్కింది. ఎర్ర జెండాలతో రెపరెపలాడింది. నంది సర్కిల్ నుంచి కార్మికులు సభా స్థలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్‌పి శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



నాయకుల అభివాదం



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు



మహాసభకు హాజరైన కార్మికులు

వంక పోరంబోకు భూమి ఆక్రమణ

శ్మశానానికి కేటాయించిన స్థలం కబ్జా
మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం సున్నా



ఆక్రమణకు గురైన యేటి పొరంబోకు భూమి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఎర్రగుంట గ్రామ పంచాయతీ ఊటకూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని తిరుమదేవరాయపల్లిలో పోరంబోకు భూమి కబ్జాకు గురైంది. ఈ భూమిని రెవెన్యూ అధికారులు శ్మశానానికి కేటాయించారు. ఆ భూమిని గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబం ఆక్రమించింది. ఈ విషయంపై గ్రామస్తులు అధికారులకు, ఏకంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇదే గ్రామంలో పుట్టి పెరిగి పెద్దవాడైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తన కుటుంబసభ్యులతో కలసి ఏకంగా శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి మామిడి చెట్లు సాగు చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామానికి ఎంతో అవసరమైన శ్మశానవాటికకు చెందిన స్థలాన్ని ఆక్రమించడం అన్యాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలం ఆక్రమణ వల్ల గ్రామస్తులకు చివరి దశలో ఆరడుగుల స్థలం కూడా దక్కకపోయే దుస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానిస్తున్నారు. శ్మశానవాటిక స్థలాన్ని గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఆయన కుటుంబ సభ్యులు ఆక్రమించుకొని స్థానికులకు ఇబ్బంది పెడుతున్నారని గ్రామస్తులు ఇటీవల గ్రామాన్ని సందర్శించిన మంత్రి వద్ద వాపోయారు. అయినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే ఆయన పాలకులు, అధికారుల వద్ద ఏ స్థాయి పలుకబడిని ఉపయోగిస్తున్నాడో అర్థం అవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల స్థానిక తహశీల్దార్, వీఆర్వో ఊటకూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని వివాదస్పదంగా మారిన ఈస్థలాన్ని పరిశీలించారు. ఈ సర్వే నెంబర్ కు సంబంధించి యేటి పోరంబోకు మిగిలిన భూమి స్మశానానికి కేటాయించినది. అంతేకాకుండా ఈ భూమికి హద్దులు చూపించి రహదారి మార్గం చూపించినప్పటికీ ఎవరు వెళ్లకుండా కంపలు వేసి ఈ భూమి తమదే అని తాము కోర్టుకు వెళ్లి ఈ భూమిని సాధించుకుంటానని బెదిరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయంపై ఇటీవలే అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీన్ని మనసులో పెట్టుకున్న కబ్జాదారులు కనీసం ఈ దారిలో వచ్చే ఖనానికి తీసుకెళ్లే మృతదేహాన్ని కూడా తన భూమిలో వెళ్లకుండా రోడ్డుకే కంపలు వేసి అడ్డుకుని ఇబ్బందులకు గురి చేశాడని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి కావలసిన శ్మశానవాటిక స్థలాన్ని చూపించి తమకు అప్పజెప్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివరణ : వంక పోరంబోకు, శ్మశానవాటిక స్థలం ఆక్రమణపై స్థానిక తహశీల్దార్ హాసీనా సుల్తానాను వివరణ కోరగా గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చిన కొద్ది రోజులకే గ్రామంలో పర్యటించామన్నారు. భూమి పంచ నామాలు గుర్తించి గ్రామస్తులతో పాటు పంచాయతీ అధికారులకు అప్పజెప్పామన్నారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణ కాకుండా విలేజ్ సెక్రటరీలు చూసుకుంటారని చెప్పారు. అయితే ఈ విషయంపై ఎర్రగుంట సెక్రటరీ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ స్థలం సమస్య తమ పరిధిలో లేదని అన్నారు. శ్మశాన వాటిక సమస్య రెవెన్యూ అధికారులే చూడాలని అన్నారు. స్థలాన్ని తమకు అప్పజెప్పి రికార్డులు ఇచ్చిన దాఖలాలు ఇప్పటివరకు లేవన్నారు.

శ్మశానవాటిక స్థల ఆక్రమణ విషయంలో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన భూమిని పరిరక్షించి గ్రామస్తులు ఉపయోగార్థం శ్మశానవాటికకు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉత్తేజభరితంగా ప్రతినిధుల సభ

పజాశక్తి-హిందూపురం

కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (అంబేద్కర్ భవన్) కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదికలో ప్రతినిధుల సభ నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం అమరవీల స్థూపాలకు, చిత్రపటానికి పూలమాల వేస్తూ మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. జెడ్ పి శ్రీనివాసులు, దిల్షాద్, నరసింహులు అధ్యక్ష వర్గంగా ప్రారంభమైన ప్రతినిధుల సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు మాట్లాడారు. కార్మికులను అణిచివేసే శక్తి సృష్టిలో పుట్టనేలేదని, కార్మికుల ఐక్యత బలమైన శక్తి అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు అనేక కుతంత్రాలు పన్నుతున్నాయని, వీటిని కార్మిక వర్గం ముక్తకంఠంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలకు మూల కారణం పాలకుల విధానాలు, ఆర్థిక స్థితిగతులేనని దాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు. గత మూడేళ్ల కాలంలో సిఐటియు జిల్లా కమిటీ చేసిన అనేక పోరాట అనుభవాలపై చర్చించుకుని నేటి మతోన్మాద, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల సాధనకై ఈ వేదిక దిక్సూచిగా నిలవాలని అన్నారు. అనంతరం వివిధ రంగాలపై చర్చించారు.

నూతన ఎఎస్పీగా సూరన అంకిత్ మహావీర్



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా అదనపు ఎస్పీగా సూరన అంకిత్ మహావీర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొంత రాష్ట్రం మహారాష్ట్ర 2021 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె తల్లిదండ్రులు వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 2023లో విశాఖపట్నం గ్రే హౌండ్స్‌లో తొలుత పోస్టింగ్‌లో చేరారు. అనంతరం ఎఎస్పీగా పార్వతీపురం జిల్లాలో పనిచేశారు. త్వరలోనే జిల్లా నూతన ఎఎస్పీగా ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

కల్తీ లేదన్నారు... మరి ఈతవనాలు ఎక్కడున్నాయి..?

ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలి
రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

హిందూపురం ప్రాంతంలో ఈతవనాలు లేవు.. కల్లులో కల్తీ జరగలేదని ఎక్సైజ్ ఉన్నతాధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు వ్యాఖ్యానించారు. ఆదివారం పట్టణంలో ఐక్య రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి ఏ.శ్రీనివాసులు, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్.నారాయణ, ఎంఐఎం పార్టీ కార్యదర్శి మున్నా, జై భారత్ భీమ్ రావు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు నాగరాజు, సమాజవాది పార్టీ నాయకులు తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్ని వేల ఈత చెట్లు ఈ ప్రాంతంలో ఉన్నాయి, ఆయా చెట్ల నుండి ఎన్ని వేల లీటర్ల కల్లు లభ్యమవుతుంది అన్న విషయాలను ఎక్సైజ్ ఉన్నతాధికారులు బహిర్గతం చేయాలన్నారు. హిందూపురం మండల పరిధిలో చౌళూరులో 13 మంది, పరిగి మండలం మోదాలో 20 మందికి పైగా, గొరవనహళ్లిలో 30 మంది, శాసనకోట 30 మంది, శ్రీరంగరాజులపల్లి 20 మంది మతిస్థిమితం లేక వింతగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. దీన్ని పక్కదారి పట్టించడానికి బాధ్యత కలిగిన అధికారులు కల్లు కల్తీ జరగలేదని చెప్పడం తగదన్నారు. కల్లు యజమానులకు అనుకూలంగా ఎక్సైజ్ అధికారులు ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి అధికారులను వీలైనంత త్వరగా ఇంటికి పంపించాలని, ఇటువంటి వారి వల్ల పేదల ఆరోగ్యాలు క్షీణించి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేంత వరకు రాజకీయ పార్టీలు ఐక్యవేదిక ప్రజా సంఘాలు కలిసి పోరాడుతుంటాయని తెలిపారు. ఒక వ్యక్తి కోసం లాభాపేక్ష కోసం అధికారులు తాపత్రయ పడుతుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హిందూపురం మండలం చౌళూరు, కొటిపి, గోళ్లాపురం, వెంకటాపురంలలో రోజుకు 200 బాక్సులు, బాక్స్‌కు రూ.12.50 చొప్పున 600 బాక్స్‌లకు రూ.1,20,000 విక్రయాలు సాగుతున్నాయన్నారు. అలాగే పరిగి మండలం ఐదు చోట్ల రూ.90 వేల కల్లు అమ్ముడుపోతోందని అన్నారు. ఇంతకల్లు ఎక్కడ నుండి వస్తోంది, ఎక్కడ ఈతవనం ఉంది, ఎన్ని చెట్లకు ఎన్ని లీటర్లు కల్లు లభ్యమవుతుందో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. గతంలో అయితే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లేవారు. ప్రభుత్వం పథకాలు పొందాలంటే ఎంతో వ్యవప్రయాసలకు లోనయ్యేవారు. దీంతో ప్రభుత్వం గ్రామాలలోనే ప్రజలకు సేవలు అందించాలన్న లక్ష్యంతో గ్రామ వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఏ పని జరగాలన్నా గ్రామంలో ఉండే సచివాలయాల్లోనే ప్రజలకు సేవలు అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. గ్రామస్థాయిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు అందుతున్నాయి. అంతేగాక సచివాలయాల ద్వారా నెల నెలా వృద్ధులకు, వితంతు, వికలాంగులకు తదితర పింఛన్లు పంపిణీ జరుగుతుంది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామం వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా ఎన్ని సచివాలయాలున్నాయి? ఎంతమంది సిబ్బంది ఉన్నారు?

నోడల్ అధికారి : జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయాలు 544 ఉన్నాయి. ఇందులో జిల్లాలోని



32 మండలాలకు గాను జిల్లాను 4 డివిజన్లుగా విభజించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 422 గ్రామ సచివాలయాలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 122 సచివాలయాలు ఉన్నాయి. గ్రామీణ సచివాలయాల్లో 2893 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో 3855 మంది పనిచేస్తున్నారు.

ప్ర : సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలు ఏమిటి?

నోడల్ అధికారి : గ్రామ వార్డు సచివాలయాల వల్ల ప్రజలకు ఎన్నో సేవలు అందుతున్నాయి. కులం, ఆదాయం, తదితర ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సచివాలయాల ద్వారానే నిర్వహించడం జరుగుతుంది. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల ద్వారా సేవలు అందుతున్నాయి. ప్రతి నెల 1వ తేదీ ఉదయమే పింఛనుదారులకు పింఛన్లు అందించడం జరుగుతుంది. తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సేవల్లో, స్త్రీ శక్తి పథకం, దీపం పథకం క్రింద మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేయడం తదితర ప్రభుత్వ పథకాలన్నీ సచివాలయాల ద్వారా నిర్వహించడం జరుగుతోంది.

ప్ర : సచివాలయాల్లో ఉన్న సిబ్బంది ఏయే హోదాల్లో పనిచేస్తున్నారు?

నోడల్ అధికారి : గ్రామీణ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ విద్య అమలు అధికారి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎఎన్ఎం, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి తదితర సిబ్బంది పనిచేస్తున్నారు. అదే పట్టణ ప్రాంత సచివాలయాల్లో వార్డు పాలన అధికారి, సంక్షేమ అమలు కార్యదర్శి, శానిటేషన్, పర్యావరణ పరిరక్షణ కార్యదర్శి, వార్డ్ రెవెన్యూ కార్యదర్శి, వార్డు ప్రణాళిక కార్యదర్శి, వార్డ్ ఎనర్జీ కార్యదర్శి, ఎఎన్ఎం, వార్డు మహిళా సంరక్షణ అధికారి తదితరులు పనిచేస్తారు.

ప్ర : సచివాలయాల పర్యవేక్షణ ఎవరు చేస్తారు?

నోడల్ అధికారి : జిల్లా అధికారిగా నేను పర్యవేక్షిస్తుంటాను. అలాగే ఎంపీడీవోలు, తహశీల్దార్లు కూడా పర్యవేక్షించే అధికారం ఉంటుంది. మొత్తం మీద ఆయా సచివాలయాల పాలన అధికారి పాత్ర ప్రధానంగా ఉంటుంది. సిబ్బంది చేస్తున్న పనులను అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

ప్ర : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

నోడల్ అధికారి : గ్రామీణ సచివాలయాల్లో మొత్తం



4620 మంది సిబ్బందికి గాను 2893 మంది పనిచేస్తుండగా 1727 మంది సిబ్బంది కొరత ఉంది. పట్టణ ప్రాంతాల్లో 5860 మందికి గాను 3855 మంది పనిచేస్తున్నారు. 2005 మంది సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రజలు గతాన్ని ప్రస్తుతాన్ని గమనించాలి. గ్రామీణ సచివాలయాల్లోనే ప్రజలకు అవసరమైన పనులు జరుగుతాయి. సమస్య ఏమున్నా సచివాలయ అధికారులను సంప్రదించవచ్చు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు..!

చోద్యంచూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా సంబంధిత అధికారులు గానీ పాలకులు గానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానికంగా మట్టికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇదే అదునుగా చేసుకున్న కొందరు నాయకులు అధికారం అడ్డు పెట్టుకొని సంపాదనే ధ్యేయంగా మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి చెరువులో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ సెలవు రోజుల్లో కొత్తపల్లి చెరువులో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వుతున్నట్లు సమాచారం. ఓ ట్రాక్టర్ మట్టిని రూ. 500 నుంచి రూ. 700 దాకా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కొత్తపల్లి చెరువులో సుమారు 15 నుంచి 20 అడుగుల మేర గుంతలు పడ్డాయి. చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను అదుపు చేయాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులు అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో అటువైపు వెళ్లకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చెరువుల్లో నీరు చేరింది. దీంతో మట్టి అక్రమార్కులు కొండలు, గుట్టలను టార్గెట్ చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట మట్టిని తరలిస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



మట్టి తరలించడంతో కొత్తపల్లి చెరువులో ఏర్పడిన గోతులు

అభివృద్ధికి ఆమడదూరంలో వైబి.హళ్లి..!

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని వైబి.హళ్లి గ్రామం రెండు దశాబ్దాల క్రితం వరకూ నియోజకవర్గ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించింది. నియోజకవర్గ రాజకీయాలను శాసించిన నాయకులు పుట్టిన గ్రామమిది. కానీ ఈ గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ గ్రామం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒకరు ఎమ్మెల్సీగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా, 12 సంవత్సరాలు సమితి అధ్యక్షులుగా పని చేశారు. అనంతపురం జిల్లా పరిషత్ ఏర్పడినప్పుడు తొలి జడ్పిటిసిగా ఓ మహిళ ఈ గ్రామం నుంచి ఎన్నికయ్యారు. ఈ మడకశిరలోనే ఓ మహిళ అనంతపురం జిల్లా పరిషత్ జడ్పిటిసి అభ్యర్థిగా రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన రికార్డు సాధించిన అభ్యర్థి ఉన్నారు. కానీ ఈ గ్రామానికి సరైన రోడ్డు లేకుండా పోయింది. రెండు దశాబ్దాల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ అభివృద్ధి జరిగినా ఈ గ్రామం వైపు ఏ నాయకుడు, అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకపోయింది. నిరసనగా గ్రామస్తులు జన్మభూమి, గడప గడపకూ వైఎస్ఆర్ వంటి కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించకూడదు అడ్డుకున్నారు. అయినా అధికారులు కానీ, పాలకులు కానీ కనికరించలేదు. వైబి.హళ్లి గ్రామం నుంచి మడకశిరకు వచ్చే దారిలో రెండు చోట్ల ఈ గ్రామానికి చెందిన చెరువు మరువవంక ఉంది. ఆ వంకపై రెండు చోట్ల చిన్న వంతెనలు మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. వర్షాలు కురిసిన సమయంలో మరువ వంక నీరు వంతెనపై ప్రవహిస్తే వైబి.హళ్లి గ్రామానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. దీంతో కోడిపల్లి, కోనప్పపాలెం, వైబి.హళ్లి గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వైబి.హళ్లి -మడకశిర మార్గంలో శిథిలావస్థకు చేరిన వంతెనలు



వైబి.హళ్లి గ్రామ సచివాలయం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గుంతల రోడ్డుతో ప్రజలు సతమతం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని వైబి.హళ్లి గ్రామంలో సచివాలయం ముందుగా వెళ్లే దారి నీటి మడుగులను తలపిస్తోంది. ఈ దారిలో డ్రెయినేజీ కాలువలు లేకపోవడం, మట్టి రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి సమీప ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు అందులోకి చేరుతోంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలతో పెద్దపెద్ద గుంతల్లోకి నీరు చేరి మడుగులను తలపిస్తోంది. ఈ మార్గంలో సచివాలయం ఉండడం, గ్రామంలో ప్రధాన రహదారి కావడంతో తరచూ ఉద్యోగులు, పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయితే ఈ మార్గంలో గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువలు, సీసీ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాధాన్యత వారీగా పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాధాన్యత వారీగా పనులు చేపట్టాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అధికారులకు సూచించారు. ఆయన ఆదివారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, నియోజకవర్గంలోని ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల నేపథ్యంలో నియోజకవర్గంలోని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం, ముదిగుబ్బ ఎంపిడిఒలు, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారంతోపాటు, గ్రామాలు, కాలనీల అభివృద్ధికి చెందిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మండలానికి ఎంత మేర నిధులు రావచ్చు.. వాటితో ఎలాంటి పనులు చేయబోతున్నారన్న అంశాల గురించి చర్చించారు. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమం నిర్వహించినప్పుడు ఎక్కువగా ఫిర్యాదులు వచ్చి ఉన్నాయన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, శ్మశానవాటికలు, డ్రెయినేజీలు, రోడ్లు, తదితర సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముందుగా వీటికి ప్రాధాన్యత ఇస్తూ పనులు రూపకల్పన చేయాలన్నారు. ధర్మవరం పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలు చెప్పారని, వాటిపై దృష్టి సారించాలని కమిషనర్‌కు సూచించారు. ముందుగా గ్రామాలు, కాలనీల్లో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

మార్కెట్ యార్డ్‌లో త్వరలో పశువుల సంత

ఛైర్మన్ పూలశివప్రసాద్

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మార్కెట్ యార్డ్‌లో త్వరలో పశువుల సంత నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని పుట్టపర్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్ తెలిపారు. ఆయన ఆదివారం అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహిస్తున్న పశువుల సంతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యార్డు సిబ్బంది, రైతుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, వివిధ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి మార్కెట్ యార్డ్‌కు సంబంధించి కొత్తచెరువు ఉప మార్కెట్ యార్డులో ప్రస్తుతం గొర్రెల సంత మాత్రమే జరుగుతుంద న్నారు. రైతుల కోరిక మేరకు పశువుల సంత నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అనుకుంటున్నామ న్నారు. అందులో భాగంగానే అనంతపురం మార్కెట్ యార్డ్‌ను సందర్శించి పశువుల సంతను పరిశీలించామన్నారు. అలాగే కొత్తచెరువు మార్కెట్ యార్డ్‌లో పశువుల సంత ఏర్పాటు చేస్తే ఎటువంటి సదుపాయాలు అవసరం అవుతాయో రైతులను అడిగి తెలుసుకున్నానన్నారు. ఆయనతో పాటు అనంతపురం మార్కెట్ యార్డ్ కార్యదర్శి కిషోర్‌కుమార్, జనసేన పుట్టపర్తి టౌన్ కన్వీనర్ సుబ్బరాము, జనరల్ సెక్రటరీ కరుణాకర్, టిడిపి నాయకులు ఉన్నారు.



అనంతపురం మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఛైర్మన్

వేడుకగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం అఖిల గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బత్తలపల్లి రోడ్డులోని సిఎన్‌బి గార్డెన్‌లో గాండ్ల కుల బంధువులు, కుల పెద్దల ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కుల బంధువులు అందరూ ఉదయం 9 గంటలకు సిబిఎన్ గార్డెన్‌కు చేరుకున్నారు. ముందుగా పరమశివునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కుల పెద్దల సమక్షంలో గాండ్ల సంఘం ఏర్పాటు, అభివృద్ధికి చేయాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి జగదీష్ మాట్లాడుతూ ధర్మవరంలో గాండ్ల సంఘం 1975 సంవత్సరంలో 17 మందితో ఏర్పడిందన్నారు. ప్రస్తుతం 209 మంది సభ్యులు ఉన్నారన్నారు. సంఘం ఏర్పడి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ వనభోజ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాండ్ల సంజీవయ్య, ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ మనం అభివృద్ధి చెందాలి అంటే విద్య ఎంతో ముఖ్యమన్నారు. అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అఖిల గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బసెట్టి గంగప్ప, కార్య నిర్వాహక అధ్యక్షుడు జోగన్నగారి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గార్లదిన్న మల్లికార్జున, కోశాధికారి పుట్టపర్తి నరసింహులు, అనంతపురం జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మేడాపురం పసల వెంకట్రాముడు, కోశాధికారి గవ్వల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన గాండ్ల సామాజిక వర్గం ప్రజలు

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్య సిస్తూ, సేవాభావాన్ని పెంపొందించుకొని, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక గుడ్డంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడ్డంలోని ప్రసిద్ధ రంగనాథ స్వామి దేవాలయం చుట్టూ, ఎంజీఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల, భవితా కేంద్రం పరిసర ప్రాంతాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారం రోజులపాటు పరిశుభ్రం చేయడం విశేషమన్నారు. వారం రోజుల పాటు సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమకు కలిగిన అనుభవాలను ప్రసంగాల ద్వారా నెమరేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల ఎంఇఒ గంగప్ప అలనాటి హిందీ పాటలు, ఘంటసాల పాటలను పాడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. సందేశాత్మక పాటలను దేశభక్తి గీతాలను ఆలపించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎంఇఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎల్ఆర్ రమేష్, ఉపేంద్ర, సంజీవరాయప్ప, భవిత సెంటర్ కోఆర్డినేటర్ లలిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్

సూక్ష్మ ప్రణాళిక సర్వే

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 5వరోజు హిందూపురం రూరల్ మండలం సంజీవరాయుని పల్లిలో ఇంటింటా సూక్ష్మ ప్రణాళిక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హరీష్ ఆధ్వరంలో ఎస్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటా తిరిగి ఎంత మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి, పథకాలు అందని వారు ఎంతమంది ఉన్నారనే విషయాలు సర్వే నివేదికలో పొందుపరిచారు. అదే విధంగా విద్యా, వైద్య,ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాలు, సమాజ సేవలపట్ల ప్రజలకు అర్థమయ్యే విధంగా ఇంటి గోడలు, ప్రభుత్వ భవనాల గోడలపై రాశారు. ఎన్ఎస్ఎస్ శిబిరాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని ప్రోగ్రాం ఆఫీసర్ హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌పై సూక్తులు రాస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సోమందేపల్లి డిప్యూటీ ఎంపిడిఒగా ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం డిప్యూటీ ఎంపిడిఒగా సాకే ప్రేమ్ కుమార్ బాధ్యతలు చేపట్టాడు. రాప్తాడు పంచాయతీలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సాకే ప్రేమ్‌కుమార్ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి డిప్యూటీ ఎంపిడిఒగా వచ్చారు. గతంలో పనిచేసిన ఈవోఆర్‌డి 3 నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఖాళీగా ఉన్న ఈ పోస్ట్‌లో సాకే ప్రేమ్ కుమార్ వచ్చారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామపంచాయతీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.





రాజీవ్ కాలనీలో శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కాలనీలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆదివారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాఠశాల ఆవరణంతో పాటు కాలనీలోని వీధులను శుభ్రం చేశారు. అలాగే కాలనీ వాసులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ, అధ్యాపకులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వాటి ఆవశ్యకతను వివరించారు. వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని, వృథా నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ వస్తువులు, చెత్తను కాలువల్లో వేయవద్దన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు కుండీల్లో వేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు ఆజాద్, బాలమోహన్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మమ్మ మర్రిమాను వద్ద అన్నదానం


ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆదివారం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు గైడ్ మనోహర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తిమ్మమ్మ మర్రిమానును సందర్శించే భక్తులకు మదనపల్లికి చెందిన దాత కృష్ణమూర్తి సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను వద్ద నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమానికి మండలంలోని పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు, దాతలు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్ సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. సిఎం చంద్రబాబు శనివారం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెకు వచ్చారు. ఆ సమయంలో పవన్‌కుమార్ ముఖ్యమంత్రిని కలిసి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నంలో మూడేళ్లుగా డిగ్రీ కళాశాల భవనం నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని, తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, వసతి గృహాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని జీవోలు-107, 108లను రద్దు చేయాలన్నారు. ఆయన వెంట విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం ఇచ్చిన యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్



సమావేశమైన బ్రాహ్మణ సంఘం నాయకులు

బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

కదిరి అర్బన్ : బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షునిగా శివకుమార్‌శర్మ నియమితులయ్యారు. మండలంలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో కదిరి కొండలో వెలసిన చౌడేశ్వరి అమ్మ సన్నిధిలో ఆదివారం ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కామేశ్వర ప్రసాద్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, శ్రీహరి ప్రసాద్ హాజరై మాట్లాడారు. అలాగే జిల్లా నాయకులతో పలు అంశాలపై చర్చించారు. జిల్లా, డివిజన్ స్థాయిలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది కుమార్, కోడూరు శ్రీకాంత్, శివకుమార్, ఫణి కుమార్, జిల్లా, కదిరి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టాపన

గుడిబండ : మండలంలోని పి.గొల్లహట్టి గ్రామంలో యాదవ సామాజికవర్గం ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది గుండుమల రాధాకృష్ణ, రాష్ట్ర ఒక్కలిగ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, శ్రీనాథ్, జయరామ్, చిత్ర శేఖర్, సన్నమారెప్ప, హెచ్‌ఆర్ శ్రీను, నాగరాజు, యాదవ కులస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంజెపి కళాశాల ప్రిన్సిపల్‌గా మంజుల

గుడిబండ : స్థానిక మహాత్మజ్యోతిబాపూలే(ఎంజెపి) కళాశాల ప్రిన్సిపల్‌గా ఆదివారం మంజుల బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో ఇదే ఎంజెపి పాఠశాల హిందీ పండిట్‌గా పని చేసేవారు. ప్రస్తుతం ఈమెను ఎంజెపి కళాశాల ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తామన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి సిబ్బందితో కలిసి కృషి చేస్తామని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా కొనసాగుతుందని ఆదివారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అలాగే అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజా గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. ఆయా డివిజన్, మండల కేంద్రాల్లో పరిష్కారం కానీ సమస్యలపై ప్రజలు కలెక్టరేట్‌లో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


30 మందిపై రౌడీషీట్

ప్రజాశక్తి-కదిరిటౌన్

వివిధ నేరాల్లో జైలుకెళ్లి వచ్చినా వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడం, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్న 30మందిపై రౌడీషీట్ నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సిఐ మాట్లాడూతూ వీరిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అలాగే పట్టణ పరిధిలోని తీవ్రమైన నేరాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ముగ్గురి పైన పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపేందుకు ఇప్పటికే కలెక్టర్‌కు నివేదికలు పంపినట్లు తెలిపారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్న మంత్రి

సోమందేపల్లి : కార్తీక మాసం సందర్భంగా స్థానిక అంబాభవానీ దేవాలయంలో ఓం శాంతి బ్రహ్మ సమాజ రాజా కుమారి మహిళలు ద్వాదశి జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనార్థం వీటిని ఐదు రోజులు ఉంచుతామని వారు తెలిపారు. ఆదివారం రాష్ట్ర మంత్రి సవిత, టిడిపి మండల నాయకులు జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. దేశంలో ఎక్కడెక్కడో ఉన్న ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఇక్కడ ఏర్పాటు చేసి దర్శనభాగ్యం కల్పించడం అభినందనీయ మన్నారు. మంత్రి వెంట ఓం శాంతి సంచాలకులు హేమావతి, భక్తులు ఉన్నారు.



ద్వాదశి జ్యోతిర్లింగాలను దర్శించుకున్న మంత్రి సవిత



నల్లమాడ జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన 1989-1993 బ్యాచ్ విద్యార్థులు

విద్యతోనే సామాజిక, ఆర్థికాభివృద్ధి

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-నల్లమాడ

విద్యతోనే సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమని విశ్రాంత ఉపాధ్యాయులు సుభహాన్, అంజాద్ బాషా పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదివిన 1989-1993 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 32 ఏళ్ల తర్వాత కలవడంతో ఒకరి నొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమ గురువులన పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి సన్మానించారు. వారి ఆశీర్వాదం పొందారు. వారి గురువులు సుభహాన్, అంజాద్‌బాషా, దేవవరం మాట్లాడుతూ సుమారు 32 ఏళ్ల తర్వాత చదివిన పాఠశాల, చదువు నేరిపన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని ఆహ్వానించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. చివరగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. విశ్రాంత పిఇటి వి.నాగభూషణం జ్ఞాపకార్థం పాఠశాల ఆవరణలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, వంద మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జూడోలో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని కెజిబివి పాఠశాల విద్యార్థినులు జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి జూడో ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించి, రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో పాఠశాలకు చెందిన విద్యార్థినిలు ఎస్.మషేరా, డి. సానియా బంగారు పతకాలను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విజయంతో హిందూపురం కెజిబివి పాఠశాల పేరు నిలబెట్టారని పాఠశాల ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. ఈ విద్యార్థినులు ఈ నెల 6,7వ తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల ప్రిన్సిపల్ తో పాటు పీఇటి సావిత్రి, జూడో కోచ్ ఎన్.ఆర్. ప్రవీణ్ కుమార్ తదితరులు ప్రతిభా విద్యార్థినులను అభినందించారు. రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని ఆకాంక్షించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



మహేంద్ర గ్రానైట్, టైల్స్ గ్యాలరీని ప్రారంభించిన తిప్పేస్వామి

మహేంద్ర గ్రానైట్స్ గ్యాలరీ ప్రారంభం

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక ఇందిరమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మహేంద్ర గ్రానైట్, టైల్స్ గ్యాలరీని ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ హాజరయ్యారు. వారిని మహేంద్ర గ్రానైట్స్, టైల్స్ గ్యాలరీ యజమాని నాగభూషణ్ పులమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజ్, సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్, సింగిల్‌విండో డైరెక్టర్ దాదాపీర్, నాయకులు నరసింహమూర్తి, జయకుమార్, సర్పంచులు లోకేష్, ధనుంజయ, మారుతిప్రసాద్, ఎపిఎంసి మార్కెట్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ కమిటీలో బత్తలపల్లి వాసులకు చోటు

ప్రజాశక్తి-బత్తలపల్లి

వైసిపి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో మండల వాసులకు చోటు దక్కింది. డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన చల్లా మహేష్‌నాయుడును రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శిగా, యర్రాయపల్లి గ్రామానికి చెందిన కమతం ఈశ్వరయ్యను రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడి చేసింది. తమ నియామకంపై వారు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో రాష్ట కమిటీలో చోటు కల్పించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉషాశ్రీచరణ్, పార్టీ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న వారికి పలువురు అభినందనలు తెలిపారు.